39.

# హృదయమే హిమాచలము

# ఈశ్వరుడే హృదయేశ్వరుడు

పునర్విత్తం పునర్మిత్రం పునర్భార్యా పునర్మహి
ఏతత్సర్వం పునర్లభ్యం నః శరీరం పునఃపునః

ప్రేమస్వరూపులారా!

ధనమును కోల్పోయిన ఏవిధమైన ప్రయత్నమైనా చేసి తిరిగి ఆ ధనము మనము సంపాదించుకొనవచ్చు. మిత్రుడు వదిలిపోయినప్పుడు మరొక మిత్రుని సంపాయించుకొని మిత్రత్వము అభివృద్ధి పరచుకొనవచ్చును. భార్య మరణించిన మరొక వివాహము చేసుకొని తాను జీవించవచ్చు. భూమిని కోల్పోయిన తిరిగి సంపాదించుకోవచ్చు. గడిచిపోయినవన్నీ తిరిగి లభ్యము కావచ్చును. ఈ శరీరము కోల్పోయిన తిరిగి సంపాదించుకోలేరు.

**మనస్సు యొక్క తత్వాన్ని గుర్తించు**

మానవుడు సమస్త సాధనలకు, సమస్త ప్రయత్నములకు, సమస్త విజయములకు ఈ దేహమే ప్రధానమైనదిగా విశ్వసించాలి. మానవశరీరము ఎంతో ఉత్తమమైనది. అనంత జీవరాసులలో, అసంఖ్యాకమైన ప్రజలలో మానవత్వము ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. ఇట్టి సౌజన్య, సౌశీల్య మానవజన్మాన్ని ధరించటమే గొప్ప అదృష్టము. అయితే ఈ శరీరమందు ఒక విచిత్రమైన మనస్సు ఉన్నది. ఈ శరీరమునందు మనస్సున్నదనే విషయము అందరికీ తెలుసు. కానీ ఆ మనస్సు యొక్క చరిత్ర విచిత్రమైనదని ఎవరికి తెలియదు. ఇది కదలనట్టే ఉంటుంది. కానీ గాలి కంటే, కాంతికంటే వేగముగా కదలిపోతున్నది. ఇట్టి మనస్సుయొక్క తత్వాన్ని మానవుడు గుర్తించుకోవాలి. మానవుడు మరణించినప్పటికిని, జీవి అనేక జన్మలు ఎత్తినప్పటికి మనస్సు మాత్రం మారదు. అన్ని జీవులయందు ఈ మనస్సు కదులుతూనే వస్తుంది. ఈ మనస్సునకు ఆయుః

sri sathyasai vachanamrutam

ప్రమాణము లేదు. ఎప్పుడూ యవ్వనంగానే ఉంటుంది. ఇట్టి మనస్‌తత్వాన్ని మానవుడు గుర్తించుకోటం చాలా కష్టము. అయితే ఈ మనస్సు ఎన్ని జన్మలెత్తినా మన వెంటనే ఉంటుంది. మనస్సుకు మరణం లేదు. మనస్సుకు వయస్సు లేదు. మనస్సుకు చింత లేదు. మనస్సుకు విచారము లేదు. మనస్సుకు ఆనందము లేదు. ఇవన్నీ కూడ కేవలం భ్రాంతులతో కూడినవే. ఇట్టి మనస్తత్వాన్ని మానవుడు గుర్తించుకున్నప్పుడే తన తత్వమును తాను గుర్తించుకున్న వాడౌతాడు.

యావత్ప్రపంచమంతయు ఒకే గృహము. సర్వమానవులు ఒకే కుటుంబము. ఇందులో భిన్నత్వమనేది ఎక్కడా గోచరము గాదు. మన తలపైనున్న ఆకాశము ఒక్కటే. కాలిక్రింద భూమి ఒక్కటే. మనం పీల్చుకునే గాలి ఒక్కటే. త్రాగే నీరు ఒక్కటే. ఇటువంటి పరిస్థితియందు భిన్నత్వము పెంచుకోటం పెద్ద అజ్ఞానం. ఈ పంచభూతముల ఏకత్వాన్ని మనం గుర్తించినప్పుడే మానవత్వాన్ని మనం సార్థకం గావించుకుంటాం. ఈనాడు మనం చేయవలసిన సాధన ఏమిటి? శరీరమును, మనస్సును, వాక్కును పరిశుద్ధముగా ఉంచుకోవాలి.

**మనస్సును పవిత్రం చేసుకో**

ఈ దేహమును ఏవిధంగా మనం పవిత్రం గావించుకోవాలి? ఏవిధమైన మార్గములో పరిశుద్ధము గావించుకోవాలి. ఏదో నీరు, సబ్బుతో దేహాన్ని పరిశుభ్రం గావించుకోటం కాదు. ఇది కేవలం భౌతికమైన, ప్రాకృతమైన, లౌకికమైన మార్గము మాత్రమే. కానీ నివృత్తి మార్గమందు దీని పరిశుద్ధత మరొక రీతిగా ఉంటున్నది. సత్సంకల్పములచేత, సద్భావములచేత, సత్కర్మలచేత, సదాచారములచేత దేహమును మనం పరిశుద్ధము గావించుకోవాలి. ఇదియే నివృత్తి మార్గములో పరిశుద్ధము. ఏపని చేసినా పరిశుద్ధమైన భావముతో మనం చేయాలి. ఈ శరీరమును పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. ఏది పరిశుద్ధము కాదని నీకు తెలుస్తుందో అప్పుడు నీ దృష్టి మరల్చాలి. కనుక పరిశుద్ధమైన కర్మలచేత యీ కాయమును మనం పరిశుద్ధము చేసుకోవాలి.

ఇంక మనస్సు. మనస్సును ఏవిధమైన మార్గములో మనము పరిశుద్ధము చేయాలి?

sri sathyasai vachanamrutam

'చిత్తస్య శుద్ధయే కర్మః'. ఈ కర్మ ద్వారా దేహము పరిశుద్ధము అయినప్పటికిని, ఇంద్రియ నిగ్రహము చేత మనస్సును పరిశుద్ధము చేసుకోవాలి. ఈ దశేంద్రియములను మనం పవిత్ర మార్గములో ప్రవేశపెట్టాలి. ఎక్కడ అపవిత్రము ఉంటున్నదో, ఎక్కడ అశుద్ధముంటున్నదో అలాంటి దానితో మనము పరిశుద్ధము చేసుకోటానికి వీలుకాదు. కన్నులు చాలా ప్రధానమైనవి.

See no evil - See what is good
Hear no evil - Hear what is good
Talk no evil - Talk wihat is good
Think no evil - Think what is good
Do no evil - Do what is good
This is the way to God.

ఈవిధముగా యింద్రియములను పరిశుద్ధము గావించుకోవాలంటే పరిశుద్ధమైన కర్మలలో ప్రవేశపెట్టాలి ఇంద్రియములను. ఇంద్రియములకు అధిపతి మనస్సు. కనుక యీ master ను పరిశుద్ధము చేయాలంటే యింద్రియములు పరిశుద్ధముగా ఉండాలి.

**వాక్కును పరిశుద్ధం చేసుకో**

ఇంక వాక్కును ఏవిధంగా పరిశుద్ధము చేయాలి? సత్యవాక్కు చేత పరిశుద్ధము చేయాలి. ధర్మకార్యములచేత పరిశుద్ధము చేయాలి. ప్రేమతత్త్వము చేత పరిశుద్ధము చేయాలి. ధర్మము, సత్యము, ప్రేమ, శాంతి యీనాలుగు మార్గముల చేత మన వాక్కును పరిశుద్ధము చేసుకోవాలి. మానవునకు శరీరము పుట్టిన తక్షణమే దాని వెంట వచ్చేది అహం. ఈ అహం అనేదే ఆత్మస్వరూపము. ఆత్మనుండి పుట్టినదే యీ అహం. కనుక అహం అనేది ఆత్మకు కుమారుడు. అహంనుండి పుట్టినదే మానవుని మనస్సు. కనుక ఆత్మకు యీ మనస్సు grandson. ఈ మనస్సు నుండి పుట్టినదే వాక్కు. ఈ వాక్కు ఆత్మకు great grand son. ఆత్మ కుమారుడు అహం. అహం కుమారుడు మనస్సు. మనస్సు కుమారుడు వాక్కు. కాబట్టి అహం, ఆత్మ, మనస్సు, వాక్కు ఇవన్నీ ఒక కుటుంబమే. మన వాక్కు దైవకుటుంబముతో చేరినదనే విశ్వాసమును మనము ధృఢపర్చుకోవాలి. మన



sri sathyasai vachanamrutam

మనస్సు భగవంతునకు grandson అనే విశ్వాసాన్ని మనం ధృఢపరచుకోవాలి. అహం అనేది భగవంతుని ప్రేమపుత్రుడుగా విశ్వసించాలి. ఈ ఆత్మ కుమారుడు, మనస్సు మనుమడు, మునిమనుమడు యీ మనోవాక్కులు. ఈ విధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యము మనము అభివృద్ధి పరచుకున్నప్పుడే మానవుని యింద్రియములు, మానవుని జీవితము, మానవుని నడత పవిత్రమవుతాయి. కానీ యీనాడు ఇంద్రియ నిగ్రహము చాలా కష్టతరంగా ఉంటున్నాది. ఈనాటి నవీన చదువులు అభివృద్ధి కావటంచేత, తెలివితేటలు పెరగటంచేత, విజ్ఞానము మరింత అభివృద్ధి కావటంచేత మానవుడు తన ఇంద్రియములకు పూర్తి వశమై పోతున్నాడు. మనస్సును ఏవిధంగా అరికట్టాలనే విధివిధానము తెలుసుకోలేక పోతున్నాడు. కనుకనే క్షణక్షణమునకు మానవుడు భయభ్రాంతులతో జీవిస్తున్నాడు. ఈ భయము ఎక్కడ నుండి వస్తున్నది? దోషములుండినప్పుడే భయము మనలో ప్రవేశిస్తుంది. దోషములే లేకున్న భయమునకు అవకాశమే లేదు. కనుక సంబంధ బాంధవ్యములు మర్చిపోయినారు. నా మనస్సు భగవంతుని మనుమడు అని మర్చిపోయారు. నా వాక్కు భగవంతుని మునిమనుమడని మర్చిపోయారు. నా అహం భగవంతుని కుమారుడే అనే సత్యాన్ని మర్చిపోయారు. ఈవిధమైన పెడమార్గములు పట్టటం చేతనే భయము ఆవరించి, అనేక రకములైన దుఃఖములకు గురిచేస్తున్నది. దినము దినమునకు పెరిగిపోయే ఈ విజ్ఞానముచేత మానవత్వం పూర్తిగా మాలిన్యమై పోతున్నది. కడపటికి మానవుడు కృత్రిమంగా జీవిస్తున్నాడు. అన్నింటి యందు artificial గానే ఉంటున్నది. తినే తిండి మొదలుకొని త్రాగే నీరు వరకు కూడా artificial గానే ఉంటున్నాది. తిండీ తీర్థమే ఏమిటి? ఈ పంచభూతములు artificial పంచభూతములుగా తయారౌతున్నాయి. అంతా మాలిన్యమై పోతున్నాది. ఈ మాలిన్యమువలన మనసు మాలిన్యమైపోతున్నది. మానవ జీవితమే మాలిన్యమైపోతున్నది. మరొకవైపు సైన్సు పెరిగిపోతున్నది. దీనివల్ల మనమెంతో విజ్ఞానము పెంచుకుంటున్నామని భావిస్తున్నాము. కానీ సైన్సు ఎంతో పెరిగిపోతున్నాదో senses అంత తరిగిపోతున్నాయి. సైన్సు పెరిగింది అని భావించుకుంటూ ఆనందిస్తున్నాము గానీ మన మానవత్వములోని దివ్యత్వము ఎంత తరిగిపోతున్నదో ఎవరూ గుర్తించుకోలేకపోతున్నారు.

sri sathyasaivachanamrutam

మానవ జీవితమే కృత్రిమ జీవితముగా జరుగుతున్నాది. ఏవిధమైన చింతలుగానీ, ఏవిధమైన భావములుగానీ, ఏవిధమైన attachment గానీ పరిపూర్ణ ప్రేమతో ఉండటం లేదు. ఒక్కొక్క పర్యాయం తల్లిబిడ్డలు మాట్లాడే మాటలు చూస్తుంటే వీరు తల్లి కొడుకులేనా అని ఆశ్చర్యము వేస్తుంది. artificial గా మాట్లాడినట్టు ఉంటుంది. నిజమైన మనస్సుతో మాట్లాడినట్టు కనిపించదు. ఈవిధముగా జీవితాన్ని గడుపుతున్నారు యీనాటి విద్యార్థులు, విద్యార్థినులు.

**ఇంద్రియ నిగ్రహం అలవరచుకో**

ఇంద్రియ నిగ్రహము వారియందు ఏమాత్రం కనిపించటం లేదు. పశువులైనా ఒక విధమైన ఇంద్రియ నిగ్రహానికి ప్రయత్నిస్తున్నాయి గానీ మానవుడు ఏమాత్రం ప్రయత్నం చేయటం లేదు. మృగములకైనా season, reason ఉంటున్నది. కానీ ఈనాటి ఆధునిక విద్యార్థులకు గానీ, విద్యార్థినులకు గానీ no season, no reason. కారణం ఏమిటి? కేవలం ఈ చదువుసంధ్యలు అభివృద్ధి కావటమే దీనికి కారణము. చదువు అభివృద్ధి కాకూడదని నేను ఆశించటం లేదు. నేనే విశ్వవిద్యాలయము పెట్టాను. కానీ ఆ చదువులతో బాటు సంస్కారము పెంచుకోవాలి. చదువులు, చదువులు ఏమిటీ చదువులు. కేవలం గ్రంథ పరిచయమే చదువులా?

> **చదవి వ్రాయనేర్చిన వారంత విద్యావంతులేనా?**
> **కాలేజీ డిగ్రీలను పొంద విద్యావంతుడగునా?**
> **సుజ్ఞానము సుకృతములు లేని విద్య విద్యయగునా?**
> **బ్రతుకుటకే విద్యయన్న పశుపక్షులు బ్రతుకలేదే.**

కనుక మనం జీవించటానికోసం చదవటం కాదు. జీవిత పరమావధిని తెలుసుకొనే నిమిత్తము చదవాలి. ఈ పరమావధితత్వాన్ని గుర్తించుటకు ప్రయత్నించినప్పుడే ఈ మానవత్వము సార్థకమవుతుంది. కేవలం యిది bookish knowledge, superficial knowledge. కానీ practical knowledge లో మనం ప్రయాణం చేయాలి. ఇదియే మన నిజమైన మార్గము. దీనికి సరైన హృదయ పరిశీలన కావాలి. ఒక చిన్న ఉదాహరణము.



sri sathyasai vachanamrutam

**మాటతప్పని స్వామి**

స్వామి యొక్క example మీకు కొంతవరకు అర్థం కావాలి. నేను ఒక్క పర్యాయము నీవు నావాడు అన్న తరువాత ఆమాట ఏనాడు తప్పను. వాడు నాకు విరోధి అయినప్పటికి నేను మరువను. నేనంటే అతను ద్వేషపడవచ్చు కానీ అతనంటే నాకు ద్వేషము లేదు. ఎవరు నాకు ద్వేషులనే వారే జగత్తులో కానరారు. ఎవరు నాకు అయిష్టమైన వారేలేరు. కనుక నేను యిచ్చిన వాగ్దానము చక్కగా నిలబెట్టుకుంటాను. నా నడక ముందుకే గానీ వెనుక వేయను. వారిని రక్షించే నిమిత్తమై ముందుకు వేస్తుంటాను. ఎలాంటి పరిస్థితులందు వెనుకంజ వేయను. అయితే ఇలాంటి పరిస్థితియందు స్వామి 'నావాడు' అనుకున్నప్పటికిని అలాంటి వారు అనేక కష్టములకు, నష్టములకు గురౌతుంటారు. తనవాడైనప్పుడు వారికి యీ కష్టములెందుకు కల్గాలి. వారి యీ బాధలకు ఎందుకు గురి కావాలి. వారెందుకు దుఃఖములో మునిగిపోవాలి అని కొంతమంది ప్రశ్నించవచ్చు. ఇది నా దోషము కాదు. నేను యిచ్చిన ప్రామిస్ చక్కగా నిర్వహిస్తున్నాను. అయితే ఈ బాధలు కల్గటానికి కారణం ఏమిటి? తాను యిచ్చిన ప్రామిస్ తప్పిపోవటమే ఈ బాధలకు మూలకారణం. తన వాగ్దానము తాను తప్పిపోవటంవల్ల, తన పవిత్రత తాను మార్చుకోటంచేత, తన అపవిత్రత తాను అభివృద్ధి పరచుకోవటంచేత తానీ దుఃఖములకు, కష్టములకు గురౌతున్నాడు. అంతేగానీ స్వామి యిచ్చే వాగ్దానము ఏనాటికి కష్టములందించదు. కడపటి వరకు నేను వెంటనే, యింటనే, జంటనే ఉంటాను.

ఇలాంటి సత్యాన్ని అనేకమంది గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. వారి కష్టములకు, నష్టములకు, దుఃఖములకు మూలకారణము ఏమిటనేది విచారించటం లేదు. వారి హృదయ మార్పులే దీనికి మూలకారణము. వారి మనో చంచలమే దీని మూలకారణము. వారు కృతజ్ఞత లేకుండా మర్చిపోవటమే మూలకారణము. పిల్లవాడు చెప్పాడు.

**తల్లి కంటె మిగుల దైవంబె దగ్గర**
**తండ్రి కంటె చాల సన్నిహితుడు**

sri sathyasai vachanamrutam

తల్లి కంటె ఎంతో ప్రేమతో చూచుకున్నప్పటికి కృతజ్ఞత వారు చూపలేక పోతున్నారు. నేను ఆ కృతజ్ఞతకోసం కాచుకోటం లేదు. కానీ నా డ్యూటీ నేను చేసినప్పుడు నీ డ్యూటీ నీవు చేయాలి. నీ స్థాయి నుండీ నీ కర్తవ్యము నీవు నిర్వర్తించాలి. కనుక మానవత్వములో యిలాంటి దోషములు ఎన్నో మనకు తెలియకుండా కనిపిస్తుంటాయి. కానీ ఈ దోషములు తనవి అని విశ్వసించు కోకుండా దైవము చేతనే మాకు యీ దుఃఖములు కలుగుతున్నాయని వాదిస్తుంటారు. దైవము ఇన్ని విధములైన వాగ్దానములు చేసి కూడా ఎందుకు తప్పిపోతున్నాడని భావిస్తారు. దైవము ఏనాటికి తన ప్రామిస్ మార్చడు. తన వాక్కు ఏనాటికి వెనుకకు తీసుకోడు. ఏనాటికైనా సంరక్షించుకుంటూ వెంటనే, యింటనే, జంటనే ఉంటాడు. కానీ యిట్టి సత్యాన్ని మానవుడు గుర్తించుకోలేక పోతున్నాడు. ఈ భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన చింతలలో మునిగి తద్వారా దైవముపైన యీ నెపమునంతా నెడుతున్నాడు. దైవము ఏనాటికి ఎవరికి ఏ కష్టములు, ఏ నష్టములు అందించడు.

**కర్మఫలం అనుభవించక తప్పదు**

నీ కర్మలయొక్క ఫలితమే నీకు యీ దుఃఖాన్ని అందిస్తుంది. నీ చర్యల ఫలితమే యీ దుఃఖాన్ని అందిస్తున్నది. నీ నడతల ఫలితమే ఈ దుఃఖాన్ని అందిస్తున్నది. కానీ ఎప్పుడు వస్తుందో, ఎలాంటిది వస్తుందో, ఏమి వస్తుందో తెలియదు. ప్రతికర్మకు ఒక ప్రతిఫలము ఉంటున్నది. ఇది అప్పటికప్పుడే జరగవచ్చు. కొన్ని గంటలలో జరగవచ్చు. కొన్ని దినములలో జరగవచ్చు. కొన్ని నెలలో జరగవచ్చు. కొన్ని జన్మలలో జరగవచ్చు. ఒక చిన్న ఉదాహరణ చూడండి. నీవు బ్లేడుతో పెన్సిలు చెక్కుతున్నప్పుడు చేయి కోసుకుంటుంది. ఆ కర్మ జరిగిన తక్షణమే రక్తము బయటకు వస్తుంది. దాని ఫలితము అప్పటికప్పుడే తెలుస్తుంది. మెట్లు ఎక్కుతుంటావు, ఎక్కడైనా కాలు జారుతుంది. జారిన తక్షణమే కాలు విరుగుతుంది. నిన్న జారటం, ఈ పొద్దు విరగటం అనేది జరుగదు. జారినప్పుడే కాలు విరుగుతుంది. ఒక విత్తనమును నీవు నాటినావు. ఆ విత్తనము నాటిన తక్షణమే చెట్టు కాదు, వృక్షముకాదు. కానీ మూడు నాలుగు దినములకు మొక్క బయలుదేరుతుంది. మూడు నాలుగు సంవత్సరములకు పెద్ద వృక్షముగా తయారవుతుంది. నీవు భోజనం చేశావు. పొద్దున్న భోజనం చేసిన తక్షణమే జీర్ణం కాదు. రెండుగంటలు టైము తీసుకుంటుంది.



sri sathyasaivachanamrutam

ఇంకా కొన్ని కొన్ని కర్మలు ఏవిధంగా ఉంటాయి. మొక్క అయిన తక్షణమే ఫలము రాదు. అది వృక్షము కావటానికి పది సంవత్సరాలు తీసుకుంటుంది. పది సంవత్సరాలైన తర్వాత ఫలము లభ్యమవుతుంది. కనుక ఈ జన్మలోనే కాక మరొకజన్మలో కూడా ఫలితము వెంటాడుతుంది.

**దైవచింతన చేయి**

మంచికాని, చెడ్డగానీ కర్మ ఫలితము తప్పునది కాదు. అయితే కర్మ ఫలితము తప్పదు కాబట్టి దైవాన్ని ఎందుకు చింతించాలి? దైవాన్ని చింతించేది ఈ బాధల నివారణకోసం కాదు. నీకు మనశ్శాంతి కోసం దైవాన్ని ప్రార్థించు. ఆ శాంతి నీకు లభ్యమైతే ఈ కష్టములు దూరమైపోతాయి. నీవు కర్మలు ఆచరించి నప్పటికి ఆ కర్మలనుంచి తప్పించి వేస్తాయి. ఒక చిన్న ఉదాహరణ. ఒక మెడిసిన్ బాటిల్ ఉన్నాది. దీనిలో మాత్రలున్నాయి. అది 97 సం॥నకు expire అయిపోయింది. కానీ 98లో కూడా ఆ బాటిల్‌లో మందు ఉందనుకోండి. ఆ మందుకు ఏవిధమైన పవరు ఉండదు. మందు ఉంది, పవరు లేదు. అదే విధముగా నీలో కర్మ అనేది ఉంది. కానీ దైవానుగ్రహము వల్ల అది expire అయిపోతుంది. ఆ expire కావటానికే నీ ప్రార్థన అవసరము. ఆ కష్టములు నిన్ను అనుభవింపచేయకుండా చేయటానికే యీ ప్రార్థన. కనుక దైవప్రార్థనచేత ఎంతో మేలు జరుగుతుంటుంది. కనుక ఆ ప్రార్థనను కూడా హృదయ పూర్వకంగా చేయాలి.

నీ హృదయం భగవంతుని స్థానము. కాబట్టి నీ హృదయమునందున్న భగవంతుని స్మరించు. ఎక్కడెక్కడోపోయి ఆనందాన్ని అనుభవించాలంటే వీలు కాదు. నీ ఆనందము బయట లేదు, పదార్థములలో లేదు, ప్రపంచములో లేదు, కర్మలలో లేదు, వస్తువులలో లేదు. ఈ ఆనందము నీ యందే ఉంటున్నాది. బయట చిక్కేది కాదు. నీవు వెతికితే లభించేది కాదు. నీవు వెతకవలసింది లోపల. నీ హృదయమునందు వెతికినప్పుడు నీకు ఆనందము లభ్యమవుతుంది.

**సోహం భావన సహజం చేసుకో**

ప్రేమస్వరూపులారా! మీ కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు

sri sathyasai vahini vachanamrutam

భగవంతుని నెపంగా తీసుకుంటున్నారు. ఎలాంటి పరిస్థితులందైనా భగవంతుని ప్రార్థించటం మీ కర్తవ్యము. ఎంతవరకు? "నేను జీవుడు - తాను దేవుడు" అనే బేధముండినంతవరకు ప్రార్థించాలి. నేనే అతడు, అతడే నేను అనే ఏకత్వము వచ్చినప్పుడు ప్రార్థించనక్కరలేదు. కారణం ఏమిటి? మనం లోపలకు పంపవలసినది ఒకటి. బయట పంపవలసినది మరొకటి. దేనిని బయటకు పంపాలి, దేనిని లోపలకు చేర్చుకోవాలి. ఈ సత్యాన్ని మనం గుర్తించుకోలేకపోతున్నాం. మన శ్వాస యీ సత్యాన్ని మనకు బోధిస్తున్నాది. చూడండి. సో...హం.., సో...హం... హం అనేది బయటకు వదలుతున్నాము, సో అనేది లోపలకు తీసుకుంటున్నాం. ఈవిధంగా ఎన్ని పర్యాయములు తీసుకుంటున్నాము. ఎన్ని పర్యాయములు వదలుతున్నాము. 21,600 పర్యాయములు మనం తీసుకుంటున్నాం విడుస్తున్నాం 24 గంటలకు. కానీ ఎవరిని లోపలకు తీసుకుంటున్నాం. సో.... తీసుకుంటున్నాము. సో - అదే దైవత్వము. దైవత్వాన్ని లోపలకు తీసుకుంటున్నాము. హం - అహంకారాన్ని బయటకు పంపాలి. ఈ అహంకారాన్ని బయటకు పంపాలి. దైవత్వాన్ని లోపల తీసుకోవాలి. ఇదియే మన జీవిత ప్రధాన సూత్రము, ప్రధాన నేత్రము, ప్రధానమైన మార్గము. మనం తీసుకోవలసింది భగవత్‌శక్తి. అదే మన ప్రాణతత్వము. ఇది జీవిత ప్రసాదము. ఈ జీవితమనే శ్వాసను మనం లోపలకు పుచ్చుకోవాలి. తీసుకోవలసింది ఏమిటి వదలవలసింది ఏమిటి? ఆక్సిజను లోపలకు పంపాలి. కార్బన్‌డయాక్సైడ్ బయటకు పంపాలి. అదియే మనకు రాక్షసి. అదియే మనకు అహంకారము. అదియే మనకు చెడ్డగుణము. ఆ చెడ్డగుణములను మనం బయటకు పంపాలి. ఈ ప్రాణవాయువు లోపలకు తీసుకోవాలి. అదియే దైవత్వము. దైవత్వమనగా ప్రాణవాయువు. కనుక ప్రాణమునే దైవముగా భావిస్తున్నారు. ప్రాణోపాసన అని దేవాలయములో చేస్తుంటారు. ప్రాణతత్వాన్ని మనం లోపల పెట్టుకోవాలి. ఈనాడు అట్లు మనం చేయటం లేదు. దేన్ని వదలుతున్నాం, దేన్ని తీసుకుంటున్నామని విచారణే చేయటం లేదు. కానీ యీ కార్బన్‌డైఆక్సైడ్ బయటకు వదలకపోతే ఆరోగ్యము పాడైపోతుంది. నీవు ఆక్సిజన్ లోపలకు తీసుకోకపోతే ఆరోగ్యమునకు ప్రమాదమవుతుంది. దైవత్వాన్ని మనం లోపలకు తీసుకోవాలి. రాక్షసత్వాన్ని బయటకు పంపాలి.

sri sathyasai vahini mutan

## ప్రవృత్తి - నివృత్తి మార్గాలు

ఈవిధముగా నిత్యజీవితములో కర్తవ్యములు ఆచరించటం వలన కొన్ని పొరపాట్లు జరుగుతున్నాయి. నీకు తెలియని పొరపాట్లు జరుగుతున్నాయి. మనము మనస్సును ఏవిధంగా పరిశుద్ధముచేయాలని గుర్తించటం లేదు. వాక్కును ఎంతవరకు పరిశుద్ధము చేయాలని గుర్తించటం లేదు. దేహాన్ని మాత్రం చక్కగా పవిత్రంచేసుకుంటున్నాం. అది కూడా ప్రాకృతమైన పరిస్థితియే. ఇది ఆధ్యాత్మికమైనది కాదు. ఇది నివృత్తిమార్గము కాదు. ప్రవృత్తి మార్గము. ఈ ప్రవృత్తి మార్గములో కొంతవరకు ప్రవేశిస్తున్నాం. ఈ ప్రవృత్తియే నివృత్తిగా తెలుసుకుంటున్నాం. అదియే wrong impression. పొరపాటు పనిచేస్తున్నాం. ఏది చెడ్డదో దాన్ని మంచిది అని అనుకుంటున్నాం. ఏది మంచిదో దాన్ని చెడ్డగా భావిస్తున్నాం. ఈనాడు మంచిది ఏదో గుర్తించటానికి ప్రయత్నించాలి. పరోపకార సంబంధమైన పనులన్నీ మంచివిగా భావించాలి. లోక క్షేమానికి సంబంధించినది మంచిదిగా విశ్వసించాలి. ఈనాడు సమాజము బాగుండినప్పుడే నీవు కూడా బాగుండగలవు. నీవు ఎక్కడివాడవు. నీవు సమాజములో ఒక వ్యక్తివి. నీ వ్యక్తిత్వము సమాజముపై ఆధారపడి ఉంటున్నది. సమాజము ఏమైపోతేనేమి నేను బాగుండాలంటే నీ బాగు ఏవిధంగా వస్తుంది? సొసైటీ బాగుంటేనే వ్యక్తిగతంగా నీవు బాగుండగలవు. వ్యక్తి యొక్క క్షేమము సొసైటీపైన ఆధారపడి ఉంటుంది. సొసైటీ క్షేమము దేశముపై ఆధారపడి ఉంటున్నది. దేశం బాగుండాలంటే సొసైటీ బాగుండాలి. ఈనాడు మనం గుర్తించవలసింది ఏమిటి? నీయొక్క మంచిని, సొసైటీయొక్క మంచిని. వ్యక్తిగతమైన ప్రార్థన. సామాజికమైన ప్రార్థన. ఈ రెండింటికి మధ్యలో కుటుంబ ప్రార్థన అత్యవసరం. కుటుంబములో తల్లితండ్రి అక్కచెల్లెలు అందరు మంచిగా ఉండినప్పుడే నీకు కూడా మంచితనం ఏర్పడుతుంది. నీవు కూడా ఆనందము అనుభవించగలవు. దీనిని పురస్కరించుకొనియే ఒక్క పదములో చెప్పింది వేదము. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అనాది కాలమునుండి భారతీయ సంస్కృతియందు అనేక విధములైన ఆధ్యాత్మికతత్వాన్ని దేశదేశములకు పంచి ప్రచురింపచేసి సుస్థిరమైన శాంతి భద్రతలందించుకుంటూ వచ్చింది. దీనినే ఋషులందరు

srisathyasaivachanamrutam

లోకాస్సమస్తా సుఖినోభవంతు అన్నారు. ప్రపంచమంతా బాగుండినప్పుడే నేను కూడా బాగుంటాను. ఈ ప్రపంచమే బాగుగాలేనప్పుడు నేను ఏవిధంగా సుఖంగా ఉండగలను. కనుక మొట్టమొదట ప్రపంచ క్షేమాన్ని కొంత వరకు ఆశించాలి.

**విశాలభావాలను పెంచుకోండి**

ఈనాటి విద్యార్థులు మన దేశక్షేమాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఆవిధంగా మనం విశాలభావాలను పెంచుకోవాలంటే మానవత్వములోనున్న విశాలమైన శక్తిని మనం అభివృద్ధిపరచుకోవాలి. ప్రపంచమెంత విశాలమైనదో ఈ భావములు కూడా అంత విశాలమైనవిగా ఉండాలి. నీ ప్రేమ సముద్రము వలే పెరగాలి. అప్పుడు నీ ప్రేమతత్వాన్ని ప్రపంచము గుర్తించటానికి ప్రయత్నిస్తుంది. ఈ విశ్వము చిన్నదిగా భావించకూడదు. జీసస్‌ను కట్టకడపటికి శిలువపై వేసే సమయంలో అందరు ఏడుస్తుండినారు. అప్పుడు ఆకాశవాణి చెప్పింది. All are one my dear son, Be alike to every one. యిదే మన భారతదేశ సంస్కృతియందు అందరియొక్క క్షేమమే నా క్షేమము అనే సత్యాన్ని ప్రబోధిస్తూ వచ్చింది. కానీ దురదృష్టవశాత్తు యీనాడు కలి కాల పరిస్థితుల మార్పుచేత స్వార్థము, స్వప్రయోజనం రాజ్యామేలుతోంది. పరార్థమెక్కడపోయింది? అదియే నిజమైన ఆధారము. పరార్థమే ప్రమాణముతో కూడినది. యిదంతా ఎట్టి ప్రమాణములకు గురికాదు. స్వార్థము. స్వప్రయోజనమునకు సంబంధించినదే స్వార్థము. సొసైటీకి సంబంధించినది కాదు. కనుక మనం సొసైటీ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అందరియందున్న దివ్యశక్తి తత్వాన్ని గుర్తించాలి.

**దుర్గ అనగా దుర్గమమైన సర్వస్వము**

ఇదియే మహాదుర్గాదేవి. దుర్గ అనగా ఏమిటి? దుర్గమనగా ఒక ఎత్తైన గుట్ట. కాని భగవంతుని అనుగ్రహమే పెద్దగుట్ట. ఆ అనుగ్రహమనే పర్వతము పైననే ఆ దివ్యత్వం ఉంటుంది. మన భారతీయుల సంస్కృతియందు ఉత్తరాయణ కాలం చాలా మంచిది అన్నారు. అనగా సూర్యుడు కూడా ఉత్తరం వైపుకే ప్రయాణం చేస్తుంటాడు. ఈ ఉత్తర దిశయంటే ఏమిటి? హిమాలయ పర్వతంపైన భగవంతుడు ఈశ్వరుడు యుంటున్నాడు.

sri sathyasaivachanamrutam

కాబట్టి సూర్యుడే యీ దిక్కు ప్రయాణం అవుతున్నాడు. కాబట్టి మన దృష్టిని కూడా యీవైపుకు మరల్చాలి. ఈ కారణం వల్లనే భీష్ముడు కూడా 56 దినములు యీ ఉత్తరాయణ కాలంకోసం కాచుకున్నాడు. అయితే దీనియొక్క అంతరార్థమేమిటి? ఈశ్వరుడు సర్వత్రా ఉంటున్నాడు. "ఈశ్వరస్సర్వభూతానాం" అంటున్నారు. ఒక్క హిమాలయాలలో మాత్రమే ఎందుకుంటాడు? దీని అంతరార్థం మన హృదయంలోనే యుంటుంది. హిమాచలమంటారు. హిమమనగా ఏమిటి? Ice. Ice ఎలా ఉంటుంది? చల్లగా ఉంటుంది. ఈ చల్లగా ఉండటమే కాదు. అచలంలాఉంటుంది. కాగా తెలుపుతో కూడినది యీ Ice. చల్లదనంతో ఉండేది Ice. అచలంగా ఉండేది పర్వతము. కనుక హిమ అచలము అన్నారు. హిమమనగా మన హృదయమే. పవిత్రమైన హృదయమే హిమాచలము. ప్రశాంతమైన హృదయమే హిమాచలము. అది చల్లగా ఉండాలి. ఏ కోపమో, ఏ తాపమో, ఏ ఈర్ష్యనో, ఏ ఢంభమో దానిలో ప్రవేశించకూడదు. పరిపూర్ణమైన, శుద్ధమైన ప్రశాంతమైనటువంటి, చలించనటు వంటి హృదయమే హిమాచలము. కనుక హిమాచలమనగా అక్కడ ఉంటున్నాడు, ఈశ్వరుడు. ఎక్కడికో నీవు ప్రయాణమై పోనక్కరలేదు. అచలమైన, శాంతమైన, పవిత్రమైన నీ చిత్తము, యీ నిర్మలమైన చిత్తమునందు భగవంతుడుంటున్నాడు.

**దుర్గమమైన దాన్ని సుగమం చేసుకో**

కనుక నీ దృష్టి అంతర్ముఖం గావించుకున్నపుడు అదే హిమాచలమై పోతుంది. ఎప్పుడు చూచినా చలిస్తూ, చలిస్తూ, చలిస్తూ ఉంటే యిది అచలం ఎలా అవుతుంది? ఇది చలించే హృదయంగా యుంటుంది. చలించే హృదయం హిమాచలం కాదు. మాలిన్యమైన హృదయం హిమాచలం కాదు. ప్రశాంతమైన హృదయం హిమాచలం. ప్రశాంతమై, పవిత్రమై, నిర్మలమై, నిశ్చలమై, చలించ నటువంటి హృదయమే హిమాచలము. కనుక యిలాంటి విషయాలు విద్యార్థులు చక్కగా గుర్తించడానికి ప్రయత్నించాలి.

ఈనాటి విద్యార్థులయందు ఏమాత్రం ఆధ్యాత్మిక చింతన కల్గటం లేదు. తల్లిదండ్రులు కూడా యీ విషయాన్ని గుర్తించటం లేదు. టీచర్స్‌కూడా దీనిని విచారించటం

sri sathyasai vachanamrutam

లేదు. తల్లిదండ్రులు మొట్టమొదట వారికి బోధించాలి. ఇంటిలో యున్నప్పుడు నాయనా! భగవంతుని చింత చేయి. భగవంతుడే మనకు సర్వ రక్షకుడు అని పిల్లలకు బోధించాలి. అలాంటిది బోధించటం లేదు. తల్లిదండ్రుల దగ్గర వుంటే కదా? వారు సుఖపడాలి, సుఖపడాలి అని ఆఫీసుకు పోతారు. ఆఫీసుకు పోయి 4.30కి ఇంటికొస్తారు. ఇంటికి వస్తూనే, నేను అలసి పోయానని, డ్రెస్ మారుస్తాడు, కారు తీసుకుని క్లబ్‌కి పోతాడు. ఎందుకోసం క్లబ్‌కి పోతున్నాడంటే rest, విశ్రాంతి కావాలి. శాంతి కావాలి నాకు. ఆ క్లబ్‌లో శాంతి వుందా? అక్కడకు పోతాడు. కార్డ్స్ ఆడతాడు. బాటిల్ తీసుకుంటాడు. ఇవన్నీ తీసుకుంటే వీనికి మంచితనం ఎలా ఉంటుంది? కనుక first వైన్ తీసుకుంటాడు. తర్వాత వైన్ వైన్‌ని తీసుకుంటుంది. తర్వాత వైన్ man ని తీసుకుంటుంది. ఇది అక్కడ జరిగేది. ఇవి సద్గుణములా? సదాచారములా? సత్ప్రవర్తనలా? కానే కాదు. కనుక మనం ఏమి చేయాలి? వస్తూనే పిల్లలకి ఆదర్శాన్ని చూపించాలి. తల్లిదండ్రులు ఈవిధమైన దురభ్యాసములతో వుండటంవల్లనే పిల్లలు కూడా ఆ దురభ్యాసములలో పాల్గొంటున్నారు.

**తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలి**

ఇక యింటిలో తల్లిదండ్రులు పిల్లల ముందర పోట్లాడుతుంటారు. ఇది చాలా చెడ్డది. పిల్లలని పవిత్రమైన మార్గములోనుండి అపవిత్రంలో ప్రవేశపెడు తున్నారు. మీ యిద్దరి మధ్యా ఏమైనా బేధములుంటే పిల్లలు లేనపుడు పోట్లాడు కోండి. పిల్లల ముందు మీ కష్టములుగాని, నష్టములుగాని, దుఃఖములుగాని మీరు మాట్లాడకూడదు. మీ problems అంతా పిల్లల హృదయాలలో చేరిపోయి, పిల్లలు చదువులో అభివృద్ధి కనపరచరు. ఈ విధమైన తల్లిదండ్రుల పోట్లాటలవల్లనే పిల్లలు కూడా పెడమార్గం పట్టిపోతున్నారు. తెల్లవారి లేచిన తక్షణమే తల్లిదండ్రులు పోట్లాడటం. లేచేటప్పటికి పోట్లాడే తల్లిదండ్రులను చూస్తే, లేచే పిల్లవాడు ఎలా వుంటాడు? వీడుకూడా పోట్లాడే ప్రయత్నం చేస్తాడు. ఈవిధంగా పిల్లలు చెడిపోవటానికి తల్లిదండ్రులే మూలకారణం. మంచి బుద్ధులు, మంచి మార్గములు, మంచి నడతలు, మంచి బోధనలు చేయాలి. డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చుని ఉంటారు తల్లిదండ్రులు. ఎవరైనా phone చేస్తారు. ఎవరో అడగరా? అంటాడు పిల్లవాడిని. అతనికి అవసరం లేనివాడు phone చేస్తే not available అని చెప్పు అంటాడు.

srisathyasaivachanamrutam

ఇది అసత్యం పిల్లలకు నేర్పినట్టు కదా! మాట్లాడటానికి నీకిష్టం లేకపోతే, మాట్లాడదు మా నాన్న అని చెప్పించు. ఈ విధంగా అసత్యాలు పిల్లలకి బోధించి పిల్లల హృదయాలు పాడుచేస్తున్నారు.

పిల్లలు యిక్కడ ఉన్నపుడు చాలా బంగారులా వుంటారు. పవిత్రమైన, స్వచ్ఛమైన బంగారులా ఉంటారు. ఈ holidays లో యింటికి పోయి వస్తారు. బ్రాసో, కాపరో తగిల్చిన బంగారులా తయారై వస్తారు. ఈవిధంగా వస్తున్నారు. ప్రత్యక్షంగా మేము చూస్తున్నాము. ఎంతమంచిగా పోయిన పిల్లలు ఎంత చెడ్డగా వస్తున్నారు. అయితే కొంతమంది మాత్రం ఎలా పోయినవారు అలానే వస్తున్నారు. ఇంకా 10 దినములు holidays వుండినప్పటికినీ అక్కడ వుండటానికిష్టం లేదు. తిరిగి వచ్చేస్తారు. అది కూడా సంస్కారాన్ని పురస్కరించుకొనియే వారి మంచి చెడ్డలు రూపొందుతున్నాయి. జన్మజన్మాంతరముల సంస్కారం వారికి అత్యవసరం. కేవలం యీ జన్మము యొక్క ఫలితమే కాదు. అనేక జన్మల పుణ్యఫలమును ప్రోగు చేసుకుని అందుకున్న అదృష్టమే యిది.

**పవిత్రమైన కాలాన్ని అపవిత్రం చేయకండి**

విద్యార్థులారా! ప్రేమస్వరూపులారా! ఈనాడు దైవత్వం గురించి మనం కొంతవరకూ గుర్తించడానికి ప్రయత్నించాలి. No god, No god అంటారు చాలామంది. ఇది science కాలము. ఇది విజ్ఞానకాలము. విజ్ఞాన సమయంలో దైవం లేకుండా పోవడానికి ఎక్కడ ఉంటుంది. ఏ కాలమందైనా ఉండేది దైవమే ఉంటుందేది. ఏ వస్తువు కూడా లేదు. కంటికి కన్పించే వస్తువులన్నీ మార్పు చెందేవే. దీనిని పురస్కరించుకొనియే వేదము "యద్దృశ్యం తన్నశ్యం" అని చెప్పింది. ఏది కన్పిస్తున్నదో అదంతా శూన్యమైపోయేదే. నేడు వుండవచ్చును. రేపు పోవచ్చును. కాని దైవము ఎప్పటికి ఉండేటటువంటివాడు. అతను పోయేవాడు కాదు. వచ్చేవాడు కాదు. ఎప్పటికినీ పర్మనెంటుగా ఉండేది దైవము. అటువంటి పర్మనెంట్ దైవాన్ని మనం విస్మరించి, అనిత్యమూ అశాశ్వతమైన దానిని స్మరించి కాలమును అపవిత్రం చేసుకోకూడదు. భగవంతుడు అందించిన కాలము చాలా పవిత్రమైనది. ఈ కాలమును పవిత్రంగా మనం గడుపుకోవాలి. ఇలాంటి కాలమును భగవంతుడు

srisathyasaivachanamrutam

అందించాక కూడా, దీనిని దుర్వినియోగం చేయటం చాలా పొరపాటు. Don't waste time. Time waste is life waste. Time is God. కాల స్వరూపుడు భగవంతుడు. కాలాయ నమః , కాల కాలాయ నమః, కాలాతీతాయ నమః, కాల స్వరూపాయనమః, కాల నియమితాయ నమః, కాలమునకు ఇన్ని బిరుదులుంటున్నాయి. ఇలాంటి పవిత్రమైన కాలమును ఈవిధంగా దుర్వినియోగం మీరు చేస్తుంటే నాకు చాలా కష్టంగా యుంటుంది.

**నా జీవితమే నా సందేశము**

My life is my message అంటుంటాను. అయితే నేను ఒక్క క్షణం కూడా waste చేయను. మీరు అనుకుంటారు. స్వామి భోజనం చేస్తూనే వెళ్లిపోతారు. పండుకుంటారు అని. నిద్ర అంటే ఏమిటో నాకు తెలీదు. నేను నిద్రపోను. అందరి దగ్గరా తీసుకుంటాను జాబులు. అయితే కొన్ని అవసరమైనవి చూస్తాను అప్పటికప్పుడే. అయితే ఏ ఒక్క పనియందూ నేను time waste చేయను. ఒక్క క్షణం అయినా నేను waste చేయను. వారితో, వీరితో మాట్లాడుతూ కాలం పవిత్రం గావిస్తాను. అయితే నాకు కావాల్సిన ఫలితం ఏమీ లేదు.

**'నమే పార్థాస్తికర్తవ్యం త్రిషు లోకేషు కించనా**
**నాన వాప్త మవాప్తవ్యంవర్త ఏ వచ కర్మణి'**

అని భగవద్గీతలో చెప్పినట్లు నా కోసం నేను ఏ పని చేసుకోను. నా కాలి నుండి తల వరకూ ఎక్కడ వెతికినా స్వార్థం అనేది ఎక్కడా కనపడదు. నాకు స్వార్థమే లేదు. నువ్వు నమ్ము, నమ్మకపో. నేనెప్పుడూ పరార్థములోనే నా కాలమునంతా సద్వినియోగం చేసుకుంటాను. ఎప్పుడూ యితరులకిచ్చేదే కాని పుచ్చుకునేది నా దగ్గర లేదు. ఒక్కదానిని మాత్రం నేను పుచ్చుకుంటాను. అదియే నిర్మలమైన ప్రేమ. ఆ ప్రేమ కల్గినవారికి నేనేమైనా, ప్రాణమునైనా యిస్తాను. నేనావిధంగా సిద్ధంగా వుంటాను. పని అనేది మీకేమాత్రం అర్థం కాదు. నిజంగా ఆ త్యాగం చేసేవారికే ఈ యోగము, భోగము తెలుస్తుంది. కొంతమంది అనుకుంటారు స్వామి ఏమి చేస్తుంటారు? ఏవిధంగా వుంటాడని. నేను పండుకున్నా పని చేస్తుంటాను. కాని యితరులకోసం నేను పండుకోవలసి వస్తుంది. లేకపోతే పక్కగా యున్నవారు

srisathyasaivachanamrutam

పండుకోరు. కనుక వారి rest కోసం నేను rest తీసుకోవలసి వస్తుంది. అయితే నా rest ఏమిటి? భక్తుల యొక్క పనులే నా rest.

**బృందావనంలో జరిగిన మహిమ**

నరసింహమూర్తి చెప్పాడు. పోయిన సారి బృందావనంలో ఒకనాడు యున్నట్టుండి, ఒక speech యిస్తూ దేహాన్ని వదలిపెట్టాను. ఈ గంగాధరశెట్టి, నరసింహమూర్తి చాలా ఆశ్చర్యపడ్డారు. ఆ దగ్గరున్నవారు అందరూ రావటానికి వీలులేదే. వీరిద్దరు మాత్రమే లోపలకి వచ్చారు. అప్పుడు చెప్పాను భర్త లేనటువంటి వనిత, ఇద్దరు పిల్లలున్నారు. నిరంతరం స్వామి చింతన చేసే ఆమె, భర్తపోయిన తర్వాత చిన్న ఉద్యోగంచేసుకుని పిల్లలని పోషించుకుంటున్నది. ఆమెకు heart attack వచ్చింది. భర్తపోయిన వియోగం ఒక దుఃఖము, పిల్లలని పోషించుకోలేకపోవటం మరొక దుఃఖము. ఈ వచ్చే ధనం వారికి చాలటం లేదు. ఈ కష్టములతో తాను నిరంతరం బాధపడుతూ, ఏదో part time work కి కూడా పోయేది. కాని ప్రతి క్షణమునందు సాయిరాం, సాయిరాం అని గ్రామఫోను plate మాదిరి కాదు చెప్పటం. హృదయం నుండి చెప్పటం. ఈవిధంగా యున్నప్పుడు ఆమెకు heart attack వచ్చింది. కాని సరిగ్గా గుర్తించుకోలేక, నరసింహమూర్తి ఆమె మరణించినట్టుగా చెప్పాడు. కాని నేను పోతే ఆమె మరణిస్తుందా? మరణించదు. కాని ఆమెకు అది మరణానికే వచ్చింది. అప్పుడు నేనేమి చేశాను? ఆమె heart attack నేను తీసుకున్నాను. అప్పుడే 7 దినములు క్రిందికి రావటం లేదు. ఎక్కడికీ పోవటం లేదు. ఆమె time అంతా నేను గడుపుతూ వచ్చాను. ఆమె అనుభవించినదంతా నేను అనుభవించాను. ఆమెని ఆరోగ్యవంతురాలిగా చేశాను. ఆమె మూడు దినముల తర్వాత telegram యిచ్చింది. స్వామీ! మీరు వచ్చారు. నన్ను రక్షించారు. నా బిడ్డలని రక్షించారు. నేను ఆమె జబ్బు తీసుకున్నట్లుగా ఆమెకి తెలీదు పాపం. ఒక వారం అయిన తర్వాత పిల్లలని తీసుకొని ఆమెనే వచ్చింది. ఈవిధంగా పవిత్రమైన, నిర్మలమైన భక్తితో యున్నవారికి ఏమైనా చేయడానికి నేను సిద్ధమే. కాని అట్టి పవిత్రమైన భక్తి ఎక్కడా కన్పించటం లేదు. కాని వున్నారు. నూటికొక్కరో, కోటికొక్కరో కన్పిస్తుంటారు.

srisathyasaivachanamrutam

**జగతి యందు పుణ్యపురుషులు లేకున్న**
**జగతి యెట్లు వెలుగు పగలుగాను**

భారతదేశంలో ఎంతోమంది పవిత్రమైన హృదయం కలవారున్నారు. ప్రపంచంలో కూడా ఎంతో పవిత్రమైన హృదయం కలవారున్నారు. కాబట్టి ప్రపంచంలో లేరని చెప్పడానికి వీలుకాదు. ఈ ఆధ్యాత్మికతత్వం ఒక్క భారతదేశానికే అనుకుంటున్నారు. కాదు, కాదు. ప్రపంచమంతా యుంటున్నాది. నిజంగా విచారణ చేస్తే యీనాడు భారతదేశంలో కంటే విదేశాలలోనే అధికంగా వుంది.

**ఎక్కడ చూచిన సాయి చింతే**

జపాన్‌లో, జర్మనీలో ఎక్కడకు పోయినా యీ ఆధ్యాత్మిక చింతన చాలా అభివృద్ధి అవుతూ వస్తోంది. నిజంగా మన భారతీయులకి ఉపనిషత్తులంటే ఏమిటో తెలీదు. బ్రహ్మసూత్రమంటే ఏమో తెలీదు. భగవద్గీత అంటే తెలీదు. కాని విదేశీయులు భగవద్గీత కంఠస్థం చేస్తున్నారు.

ఇటలీలో ప్రెసిడెంట్ మెనోలిన్ అని వున్నాడు. ఆయన బిడ్డ బ్రహ్మ సూత్రమంతా చెప్పేస్తుంది. రుద్రమంతా చెప్తుంది. అక్కడ Mother Sai అని ఒక బిల్డింగ్ కట్టుకుంది. 25 ఎకరములలో దానిని నిర్మించుకుంది. స్వామి ఏనాటికైననూ యిక్కడకి రాగలడు అని అందుకోసమని ఒక పూర్ణచంద్ర హాలువలె ఒక పెద్ద హాలు కట్టింది. ప్రెసిడెంట్ బిడ్డ ఆమెకు కావల్సినంత ధనం వుంది. పెద్దహాలు కట్టుకుంది. స్వామి వెంట వచ్చే విద్యార్థులకు, పెద్దవారికి అని రూములంతా కట్టిచింది. Students ని యిక్కడ పెట్టాలి, స్వామి వస్తే యిక్కడ పెట్టాలి, Public meeting అయితే ఈ హాలులో పెట్టుకోవాలి అని యీవిధంగా plan వేసుకుంది. అన్నీ master plan లు వేసుకుంది. ఈవిధంగా వుండి, ఆమె భగవద్గీత ఎంతో స్పష్టంగా చెప్తుంది. మన primary school లో జర్మనీ పిల్లలు చదువుతున్నారు. ఎంత చక్కగా చెప్తారో వేదపారాయణం. సుస్పష్టంగా చెప్తారు. దీనికి కారణం ఏమిటి? సంఘ దోషమే. సంఘం మంచిదిగా యున్నప్పుడు పిల్లల భవిష్యత్తు కూడా మంచిదిగా యుంటుంది. Tell me your company, I shall tell you what your are అని, నీ కంపెనీ

sri sathyasai vachanamrutam

ఎలాంటిదో, నువు కూడా అలాంటి వాడుగా వుంటావు. కనుకనే

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః

## త్రికరణ శుద్ధి

మీరు ఎక్కడికి పోయినా మంచి కంపెనీలో చేరండి. మీ హృదయాన్ని పవిత్రంగా, నిర్మలంగా చేయండి. మీ మనస్సనంతా పవిత్ర కర్మలచేత పరిశుద్ధ పరచండి. మీ వాక్కునంతా సత్యంచేత, ప్రేమచేత, శాంతంచేత నింపండి. అందువల్లనే భగవద్గీత యందు చెప్పారు. **"సత్యం ప్రీతి హితంచ యత్"**. ఈ సత్యం ప్రీతిగా వుండాలి. అప్రీతిగా వుండరాదు. కఠినంగా వుండకూడదు. సత్యం చెపుతున్నామని కఠినంగా మాట్లాడకూడదు. కనుక పవిత్రమైన వాక్కులుగా వుండాలి. ఇదియే మనము ఈనాడు చేయవలసిన సాధన.

కొంతమంది అనుకుంటారు. భజన, జపము, ధ్యానం యివన్నీ ఎందు కోసం చేస్తున్నామని. ఇవన్నీ సత్కర్మలు. కాలమును పవిత్రం గావించుకునే కర్మలు. కాని దైవానికి ప్రీతికరమైన కర్మలు కావు. దైవానికి ప్రీతికరమైన కర్మలు ఏమిటి? దేహమును పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టాలి. మనస్సుతో పవిత్రమైన చింతలు చేయాలి. వాక్కుతో నిస్వార్థమైన, నిర్మలమైన పలుకులు పలకాలి. ఇవియే భగవంతునికి ప్రీతికరమైన వస్తువులు.

కనుక భగవంతుడిని ప్రీతి పరచాలంటే సత్యాన్ని పలుకు. ఏ పనిచేసినా పరోపకార కర్మలు చేయి. నీ హృదయాన్ని నిర్మలమైనభావంతో నింపుకో. కనుకనే దీనినే త్రికరణశుద్ధి అన్నారు భారతీయులు. చిత్తశుద్ధి అనగా ఏమిటి? త్రికరణశుద్ధి. మూడుకరణములు. కరణములనగా పనిముట్లు. భావము, వాక్కు, కర్మ యీ మూడింటినీ పవిత్రం చేయాలి. దీనినే the proper study of mankind is man అన్నారు. ఈవిధమైన కర్మలచేత మనం జీవితాన్ని సార్థకం చేసుకుని, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలని విద్యార్థులకు నేను ప్రత్యేకంగా బోధిస్తున్నాను. ఇక్కడి నుండి వెళ్ళినటువంటి విద్యార్థులు ఎన్నివేల మందినో మార్చటానికి కంకణం కట్టుకోవాలి. మీరు మంచిగా నడుచుకుని వారికి మంచిని అందించాలి. కేవలం వాక్కులచేత బోధించటం మాత్రం కాదు. నీవు చేసి చూపించాలి.

srisathyasaivachanamrutam

అప్పుడే సరియైన సార్థకత దొరుకుతుంది.

**నీకు తెలిసినది పదిమందికి అందించు**

ఈ ఇనిస్టిట్యూట్‌లో నీవు చదివినందుకు సార్థకుడవయిపోతావు. కనుక ఎవరి దగ్గరా ఏవిధంగా నయాపైసా తీసుకోకుండా చదువు చెప్పిస్తున్నాము. మీరు దీనికందించవలసిన ఘనత ఏమిటి? మీ ఇన్స్టిట్యూట్‌కి కృతజ్ఞత ఏవిధంగా అందించాలి. మీరు యిక్కడి నుంచి పోయి, యిక్కడ నేర్చుకున్నది పదిమందికి అందిస్తే అదే కృతజ్ఞత. ఇదే నిజమైన gratitude. ఇది అందించాలని మీరు ఒక దీక్షను పూనాలి. నీ ఉద్యోగం నువ్వు చేసుకో. దానిని వదలనక్కర లేదు. నీ తల్లిదండ్రులని నీవు పోషించుకో తప్పులేదు. కాని దానితోపాటు, చదివినటు వంటి గురువుల యొక్క స్థానానికి కూడా ఒక కృతజ్ఞత అందించాలి. దైవత్వాన్ని హృదయంలో నింపుకోండి. అక్కడినుండి వచ్చినవన్నీ పవిత్రంగా వుంటాయి. Tank పవిత్రమైన నీటితో నింపుకున్నప్పుడు, Taps లో అంతా పవిత్రమైన నీరే వస్తాయి. నీ హృదయమే tank. నీచూపులు, నీ మాటలు, నీ నడతలు అన్నీ taps. కనుక నీ హృదయాన్ని ప్రేమతో నింపుకుంటే యీ ప్రేమతోనే ప్రపంచాన్ని అనుభవించవచ్చు.

ఈవిధమైన మార్గములో విద్యార్థులు ప్రవేశించి, ఆదర్శవిద్యార్థులుగా మీరు రూపొందాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 29-09-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam